
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం । 18 । అక్టోబర్ । 2023



సోమశిలలో 30.510 టీఎంసీల నీరు

సోమశిల జలాశయంలో మంగళవారం 30.510 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 1186 క్యూసెక్కుల ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,080
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,515
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,680
నవర (8 గ్రాములు)	రూ.45,440

గరిష్ఠం/కనిష్ఠం
36.0 /27.2

వాతావరణం

మంగళవారం గాలిలో తేమ 58 శాతం ఉంది. బుధవారం ఎండతీవ్రత, ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

జూనియర్ కాలేజీలకు రేపటి నుంచి సెలవులు



రావూస్ కళాశాలను సందర్శించిన ఆర్‌జేడీ సుబ్బారావు

నెల్లూరు(టౌన్): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించినట్లు ఆర్జేడీ వీవీ సుబ్బారావు మంగళవారం తెలిపారు. ఆయన పలు ప్రైవేట్ జూనియర్ కళాశాలలను సందర్శించి రాజకీయ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు గుర్తించిన యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా కళాశాలల్లో రాజకీయ ప్రచార కార్యక్రమాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఏ కళాశాలలోను ఇలాంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం గాని, ప్రోత్సహించడం గాని చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సాగరమిత్రల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద తాత్కాలిక ప్రాతిపదికన కాంట్రాక్టు పద్ధతిపై 30 మంది సాగరమిత్రల నియామకం చేపడుతున్నట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ షిషరీస్, సైన్స్, మెరైన్ బయాలజీ, జువాలజీ డిగ్రీ విద్యార్హత కలిగిన అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. నెలకు రూ.15 వేలు అందజేయడం జరుగుతుందని, మెరిట్, ఇంటర్వ్యూల ద్వారా నియామకం చేపట్టనున్నట్లు తెలిపారు. వివరాలకు మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు నెల్లూరు వారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. దరఖాస్తులు ఈ నెల 28వ తేదీలోగా అందాలన్నారు.

ప్రభుత్వ మద్యం దుకాణాల ఉద్యోగుల అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

ఉదయగిరి: బెల్టు దుకాణాలకు మద్యం సరఫరా చేస్తున్న ఇద్దరు ఉద్యోగులను అరెస్ట్ చేసినట్లు ఉదయగిరి సెబ్ కార్యాలయ ఎస్సై మురళీకృష్ణ తెలిపారు. ఈ నెల 2వ తేదీన గాంధీ జయంతి సందర్భంగా సీతారామపురంలో ఆదోని ఏడుకొండలు మద్యం విక్రయిస్తుండగా నెల్లూరు జేడీ బృందం దాడులు నిర్వహించి అతని వద్ద 155 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారన్నారు. ఆ సీసాలు సీతారామపురం ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి సరఫరా అయినట్లు విచారణలో వెల్లడైందన్నారు. మద్యం దుకాణాల సూపర్‌వైజర్ ఎల్.వెంకటరంగరాజు, సేల్స్‌మెన్ పి.నాగేంద్రప్రసాద్‌ల పాత్ర ఉన్నట్లు గుర్తించి వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచినట్లు తెలిపారు.

తల్లీ, కుమార్తె ఆత్మహత్య

- నెల్లూరు విక్రమ్‌నగర్‌లో ఘటన



భానులత



లక్ష్మి

నెల్లూరు(క్రైమ్): తన కడుపులో ఎనిమిది నెలల బిడ్డ ఉన్నా.. భర్త మృతిని జీర్ణించుకోలేని వివాహిత తన తల్లితో కలిసి ఆత్మహత్య చేసుకున్న ఘటన విక్రమ్‌నగర్‌లో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన సుధాకర్‌రెడ్డికి ఇది వరకే వివాహమైంది. భార్య పిల్లలున్నారు. ఆయన బీవీనగర్‌లో ఓ షాపు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో నెల్లూరు రూరల్ మండలం అల్లీపురానికి చెందిన భానులత(33)తో ఆయనకు పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమకు దారితీసి కొంతకాలం కిందట వివాహం చేసుకున్నారు. భానులత తన తల్లి లక్ష్మి(48)తో కలిసి నెల్లూరు విక్రమ్‌నగర్‌లో నివాసం ఉంటోంది. ప్రస్తుతం భానులత ఎనిమిది నెలల గర్భిణి. ఈ నేపథ్యంలో ఈనెల 16న సుధాకర్‌రెడ్డి అనారోగ్యంతో మృతిచెందారు. మంగళవారం ఆయన అంత్యక్రియలు జరిగాయి. భర్త మృతిని జీర్ణించుకోలేని భానులత తన తల్లితో కలిసి చనిపోతున్నానని సూసైడ్‌లేఖ రాసింది. ఇంట్లోని ఫ్యాన్‌కు ఇద్దరూ చీరలతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. గమనించిన స్థానికులు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ వీవీ నారాయణ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

‘ఉన్నతి’తో ఉద్యోగ అవకాశాలు



శిక్షణ పొందుతున్న నిరుద్యోగులు

ఉన్నతి కార్యక్రమంతో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పేద ప్రజలకు పనులు కల్పిస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తోంది. వంద రోజుల పనులు పూర్తి చేసిన కుటుంబాల్లోని చదువుకున్న పిల్లలకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఉపాధి కుటుంబాల్లో మెరుగైన జీవనం

- నిరుద్యోగులకు శిక్షణ కార్యక్రమాలు
- కంప్యూటర్ స్కిల్స్‌పై ప్రత్యేక దృష్టి
- ఉచిత వసతి, భోజన సౌకర్యాలు

నెల్లూరు(పొగతోట): పేద కుటుంబాల్లోని నిరుద్యోగులను గుర్తించి వారి విద్యార్హతల ఆధారంగా వివిధ రంగాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 40 మంది మహిళలకు రిటైల్ సేల్స్ సూపర్‌వైజర్లుగా శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం మొదటి బ్యాచ్ శిక్షణ జరుగుతోంది. శిక్షణ పూర్తి చేసిన వారికి వంద శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. నెల్లూరు వీఆర్ జూనియర్ కళాశాలలో ఎస్‌ఆర్‌టీపీ సెంటర్ ఏర్పాటు చేశారు. మహిళలకు వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ సమయంలో రోజుకు రూ.272 స్టైఫండ్ చెల్లించనున్నారు. ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తున్నారు. నాలుగు నెలలపాటు శిక్షణ ఉంటుంది. ఉపాధి హామీ పథకంలో వంద రోజులు పనులు పూర్తి చేసిన కుటుంబాల్లోని చదువుకున్న నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి వారికి ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పించనుంది. డీఆర్‌డీఏ, డ్వామా శాఖల సమన్వయంతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ (సిడాప్) ద్వారా నిరుద్యోగులకు శిక్షణ ఇస్తున్నారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సులోపు ఉన్న యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. గడిచిన మూడు సంవత్సరాల నుంచి 3,101 మంది నిరుద్యోగులకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చారు. వారిలో 2,450 మందికి వివిధ పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించారు. డీఆర్‌డీఏ అధికారులు 10, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ, బీటెక్ తదితర చదువులు పూర్తి చేసిన వారి వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి స్థాయిలో వివరాలు సేకరించి వారికి ఎటువంటి శిక్షణలో ఇవ్వాలో గుర్తిస్తున్నారు.

శిక్షణ కార్యక్రమాలు

సీఆర్ఎం డొమెస్టిక్ నాన్–వాయిస్, మెడికల్ ఎక్విప్‌మెంట్ టెక్నీషియన్ (బేసిక్ క్లినికల్ ఎక్విప్‌మెంట్), ఫీల్డ్ టెక్నీషియన్–కంప్యూటింగ్, పెరిఫెరల్స్, ఆటోమోటివ్ సర్వీస్ టెక్నీషియన్, మల్టీస్కిల్ టెక్నీషియన్, టూర్ మేనేజర్, ఈవెంట్ మీటింగ్ కాన్ఫరెన్స్ ప్లానర్, ఫెసిలిటి మేనేజర్ తదితర కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నారు. 3, 6, 12 నెలల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు మెటీరియల్, ఎన్ఎస్‌డీసీ సర్టిఫికెట్ అందజేస్తున్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభం కావలిసి ఉంది.

కంప్యూటర్ స్కిల్స్‌పై ప్రత్యేక దృష్టి



పరిశ్రమలు, షాపింగ్ మాల్స్, దుకాణాల్లో కంప్యూటర్ వినియోగం అధికంగా ఉంది. కంప్యూటర్‌పై అవగాహన లేకపోతే ఉద్యోగాలు లభించడం కష్టంగా మారింది. దీంతో శిక్షణ సమయంలో అధికంగా కంప్యూటర్ స్కిల్స్ డెవలప్ చేసుకునేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఎస్ఆర్‌టీపీ సెంటర్‌లో వివిధ రంగాల్లో అనుభవం కలిగిన ముగ్గురు ట్రైనర్లను నియమించారు. ట్రైనర్లు మహిళలకు కంప్యూటర్ స్కిల్స్, ఇతర రంగాలపై శిక్షణ ఇస్తున్నారు. ఉదయం, సాయంకాలం సమయాల్లో బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, చెస్ తదితర ఆటలు ఆడుకునేలా చర్యలు తీసుకున్నారు.

డిగ్రీ పూర్తి చేశా



నేను డిగ్రీ పూర్తి చేశాను. మా కుటుంబ సభ్యులు ఉపాధి హామీ పనులకు వెళతారు. ఉపాధి హామీ పనులు వంద రోజులు పూర్తి చేశాం. ఉన్నతి పథకం ద్వారా శిక్షణ కార్యక్రమాలు ఇస్తున్నారు. ట్రైనర్లు ప్రతి విషయాన్ని అర్థం అయ్యేలా శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పూర్తి అయిన తరువాత ఉద్యోగ అవకాశాలు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

–నాగలక్ష్మి, రెడ్డిపాళెం, ఉదయగిరి మండలం

కంప్యూటర్ స్కిల్స్‌పై అవగాహన



ఎస్ఆర్‌టీపీ సెంటర్‌లో సౌకర్యాలు బాగున్నాయి. కంప్యూటర్ స్కిల్స్‌పై అవగాహన కల్పిస్తున్నారు. పనిచేసే ప్రదేశాల్లో ఎవరితో ఏ విధంగా ఉండాలి తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి విషయాన్ని అర్థం చేసుకునేలా శిక్షణ ఇస్తున్నారు.

–లోకేశ్వరి, యల్లాయపాళెం, కొడవలూరు మండలం

శిక్షణతో ఉద్యోగ అవకాశాలు



ఉన్నతి కార్యక్రమం ద్వారా నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం. ప్రస్తుతం బ్యాచ్‌లో 50 మందికి శిక్షణ ఇస్తున్నాం. ఎస్ఆర్‌టీపీ సెంటర్‌లో 4 నెలల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నాం. శిక్షణ సమయంలో కంప్యూటర్ స్కిల్స్ డెవలప్ చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. గడచిన మూడు సంవత్సరాల్లో 3,101 మందికి శిక్షణ ఇచ్చి 2,450 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాం.

–హైమావతి, జేడీఎం

సద్వినియోగం చేసుకోండి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఉన్నతి కార్యక్రమాన్ని రూపొందించారు. ఉపాధి హామీ పథకంలో వంద రోజుల పనులు పూర్తి చేసిన కుటుంబాల పిల్లలకు ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. శిక్షణ పూర్తి చేసిన వారికి పరిశ్రమలు, పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుని అమలు చేస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ యువకులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

–సాంబశివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ

నేటి అలంకారం



శ్రీ అన్నపూర్ణాదేవి

ఆకస్మిక తనిఖీ



మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలీ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని కాగులపాడు గ్రామంలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని జిల్లా లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ సయ్యద్ ఖాదర్‌వలీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాలయకాగొల్లు గ్రామంలో 400కు పైగా ఓపీ నమోదు కావడం ప్రజల్లో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహనను తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో జొన్నవాడ పీహెచ్‌సీ వైద్యుడు సయ్యద్ అహ్మద్‌బాబు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేదల ముంగిటకే మెరుగైన వైద్యం

- కార్పొరేటుకు దీటుగా ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వం
- జగనన్న ఆరోగ్య సురక్షలో మంత్రి కాకాణి



శిబిరంలో వైద్యం చేయించుకుంటున్న వృద్ధుడిని పరామర్శిస్తున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి


మనుబోలు: పేదల చెంతకే వైద్య సేవలను తీసుకొచ్చి ధనవంతులతో సమానంగా పేదవాడికి మెరుగైన వైద్యాన్ని అందించాలన్న సంకల్పంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చెర్లోపల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. తొలుత వైద్య శిబిరంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్, కేస్ షీట్ కౌంటర్, స్పాట్ రిజిస్ట్రేషన్, ల్యాబ్ టెస్టింగ్, మందుల పంపిణీ కౌంటర్‌లను ఆయన పరిశీలించి రోగులకు అందజేస్తున్న వైద్య సేవలను డాక్టర్‌లు, వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎంతో కాలంగా పలు రకాల వ్యాధులతో బాధపడుతూ ఆసుపత్రులకు వెళ్లకుండా నిర్లక్ష్యం వహిస్తున్న పేదలకు వారి ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలు అందించడమే ఆరోగ్య సురక్ష ప్రధాన ఉద్దేశమన్నారు. ఇప్పటి వరకూ 348 క్యాంపులు నిర్వహించి 1.50 లక్షల మందికి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. ఈ శిబిరంలో వైద్యం చేయించుకున్న రోగులకు నిరంతరం వైద్యుల పర్యవేక్షణ, మందుల పంపిణీ ఉంటుందని తెలిపారు. ఈ శిబిరాల్లో 7 రకాల పరీక్షలు ఉచితంగా చేసి వారికి అవసరమైన 172 రకాల మందులను అందుబాటులో ఉంచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ పెంచలయ్య, వైద్యులు సుబ్బరాజు, గేయపూజిత, ఎంపీపీ వజ్రమ్మ, ఉప సర్పంచ్ రమణకుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చేడిమాల బుజ్జిరెడ్డి, బొమిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, నారపరెడ్డి కిరణ్‌రెడ్డి, ముంగర రవీందర్‌రెడ్డి, కోసూరు కోటేశ్వరగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఓ వృద్ధురాలికి ఆరోగ్య సురక్ష కిట్ అందజేస్తున్న మంత్రి కాకాణి

డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ కార్డులొచ్చాయ్

- జిల్లాకు వచ్చిన 90 వేల కార్డులు
- పోస్టు ద్వారా నేరుగా ఇంటికే



జిల్లాకు వచ్చిన ఆర్సీ కార్డులు

నెల్లూరు (టౌన్): ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ కార్డులొచ్చాయి. రెండున్నరేళ్ల నుంచి కార్డులు లేక జారీని రవాణా శాఖాధికారులు నిలిపివేశారు. గత 10 రోజులుగా కార్డులను రాష్ట్ర రవాణాశాఖ కార్యాలయం నుంచి పంపిస్తున్నారు. ఈ నేపథ్యంలో వచ్చిన లైసెన్స్, ఆర్సీ కార్డులను ముద్రించే పనిలో రవాణాశాఖ అధికారులు, ఉద్యోగులు ఉన్నారు. కార్డుల కొరత కారణంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు 68 వేలు, వాహన ఆర్సీలు 92 వేలు వరకు నిలిచిపోయాయి. దీంతో రవాణాశాఖ ఉన్నతాధికారులు డ్రైవింగ్ లైసెన్స్‌లకు సంబంధించి కార్డులు 30వేలు, వాహన ఆర్సీలకు సంబంధించిన కార్డులు 60 వేలు వరకు పంపించారు. మిగిలిన పెండింగ్ కార్డులను కూడా విడతల వారీగా రవాణా కార్యాలయానికి పంపించనున్నారు. పెండింగ్ కార్డులను రవాణా అధికారులు ముద్రించే పనిలో పడ్డారు. కార్డుల ముద్రణకు వంతుల వారీగా ఉద్యోగులు, అధికారులకు డ్యూటీ కేటాయించారు. ముద్రణ అయిన డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ కార్డులను రిజిస్టర్ పోస్టు ద్వారా నేరుగా ఇంటికి పంపిస్తున్నారు. ఇప్పటికే 60 వేలకు పైగా కార్డులను రిజిస్టర్ పోస్టు ద్వారా వాహనదారుల ఇళ్లకు పంపించినట్లు ఉప రవాణా కమిషనర్ బి.చందర్ తెలిపారు.

జూలై 25 నుంచి డిజీలాకర్‌లోనే లైసెన్స్‌లు


ఈ ఏడాది జూలై 25వ తేదీ తర్వాత డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఆర్సీలకు సంబంధించి కార్డులు రావు. వీటిని డిజీ లాకర్, ఎం పరివాహన్ యాప్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్లేస్టోర్ ద్వారా ఎం పరివాహన్, డిజీ లాకర్ యాప్‌ల్లో లాగిన్ అయి ఫోన్ నంబరు, మెయిల్‌ను రిజిస్టర్ చేసుకుంటే ఓపెన్ అవుతుంది. డ్యాష్ బోర్డులో యాడ్ వర్చువల్ డ్రైవింగ్ లైసెన్స్, యాడ్ వర్చువల్ ఆర్సీలు అని వస్తుంది. డ్రైవింగ్ లైసెన్స్‌కు అయితే పుట్టిన తేదీ, ఆర్సీకి అయితే వాహన నంబరు, ఛాసెస్ నంబరులో చివరి 5 అంకెలు, ఇంజన్ నంబరులో చివరి 5 అంకెలను నమోదు చేయాల్సి ఉంటుంది. అనంతరం వివరాలు డిస్‌ప్లే అవుతాయి.

దశాబ్దాల సమస్యకు శాశ్వత పరిష్కారం

ఎన్నో ఏళ్ల సమస్య అది. కావలి మండలంలోని సుమారు 10 గ్రామాల ప్రజలకు సంబంధించిన చెరువులో రోడ్డు నిర్మాణ సమస్య. ఎవరూ పట్టించుకోలేదు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు కీలకమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రాధాన్యత ఇచ్చి నిశ్శబ్దంగా పనులు చక్కదిద్దుతున్నారు. చెరువు మధ్యలో రూ.32 లక్షలతో సుమారు కిలోమీటరు రోడ్డును నిర్మించారు. గ్రామ పంచాయతీ నిధులతో కరెంట్ స్తంభాలు సమకూర్చే పనులు జరుగుతున్నాయి.

నడుంలోతు నీటిలో ఏళ్లుగా ప్రజల రాకపోకలు

- గతంలో నాయకులెవరూ పట్టించుకోని వైనం
- చెరువు మధ్యలో రూ.32 లక్షలతో రోడ్డు నిర్మాణం
- ఆరు గ్రామాల్లోని పదివేల మంది ప్రజలకు రవాణా వసతి
- మరో ఐదు గ్రామాల రైతుల సేద్యం పనులకు సౌలభ్యం
- ఎమ్మెల్యే రామిరెడ్డి చొరవతో పూర్తయిన పనులు



చెరువులో నిర్మించిన రోడ్డు

కావలి: కావలి రూరల్ మండలంలోని మన్నంగిదిన్నె చెరువు ఉంది. ఆ చెరువు ఆ గ్రామానికి సంబంధం లేకుండా, కావలి రూరల్ మండలంలోని ఆనెమడుగు, సర్వాయపాళెం, మాతినవారిపాళెం తదితర గ్రామాల్లో ‘అమెజాన్ నది’లా విశాలంగా విస్తరించి ఉంటుంది. వర్షాలు వచ్చినప్పుడు, చెరువులో నీళ్లు ఉన్నప్పుడు అసలు సమస్య ఉత్పన్నమౌతోంది. కావలి రూరల్ మండలంలోని సర్వాయపాళెం, మాతినవారిపాళెం, కోనేటివారిపాళెం, పెద్దదిన్నెపాళెం, మోర్లవారిపాళెం, మొండిదిన్నెపాళెం తదితర గ్రామాల ప్రజలతో పాటు ఆనెమడుగు, చెన్నాయపాళెం, మన్నంగిదిన్నె తదితర గ్రామాలకు చెందిన 10 వేల మంది ప్రజలు సర్వాయపాళెం – మాతినవారిపాళెం గ్రామాల నడుమ ఉన్న మన్నంగిదిన్నె చెరువును తప్పనిసరిగా దాటుకొని పోవాలి. వర్షాలు సమయంలో, చెరువులో నీరు ఉన్నప్పుడు ఈ చెరువును దాటాలంటే పూర్వం నీటిపై తేలాడే తెప్పలపై ప్రయాణం విధిగా చేయాల్సి వచ్చేది. తెప్పలు కనుమరుగైపోవడంతో నడుం వరకు నీరు ఉంటే మాత్రం ఆ నీటిలోనే నడుచుకుంటూ దాటేవారు. పురుషులు అయితే తమ పిల్లలను భుజంపై పెట్టుకొని చెరువును దాటేవారు. మహిళలు నానా ఇక్కట్లు పడేవారు. పిల్లలు చదువులు, నిత్యావసర వస్తువులు, వ్యవసాయం పనులు చేసుకోవడానికి పొలాలకు, వైద్యం కోసం, కూలి పనులు కోసం, ప్రయాణాలు కోసం... ఇలా ఇల్లు దాటి చక్కబెట్టుకోవాల్సిన ప్రతి ఒక్క పనికి కూడా ఈ చెరువును ప్రజలు విధిగా దాటాల్సిందే. ప్రమాదకరమైన పరిస్థితుల్లో చెరువును దాటుకొని తడిసిపోయిన దుస్తులతో రాకపోకలు చేస్తూ అనేక అవస్థలు పడుతుండేవారు.



నీరు ప్రవహించడానికి పైపులతో ఏర్పాటు చేసిన బ్రిడ్జి

ఇప్పుడు ఏమి చేశారంటే...

సమస్య తీవ్రతను అర్థం చేసుకున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఇరిగేషన్ అధికారులతో సమాలోచన చేసి, సమస్యను పరిష్కరించాలని భావించారు. దీంతో గతంలో వలె భారీగా నీరు చెరువుకు చేరడం లేదని, ఎక్కడికి అక్కడ కాలువలు పెరిగిపోవడం, ఆ కాలువల్లో కూడా నీటి ప్రవాహం ఓ మాదిరిగా ఉండటాన్ని గుర్తించారు. ప్రస్తుతం భారీ బ్రిడ్జి కాకుండా కొంత ఎత్తుగా రోడ్డు నిర్మాణం చేసి, రోడ్డు కింద నీటి ప్రవాహానికి అనువుగా పైప్‌లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలు రాకపోకలు సాగించడానికి రోడ్డు మార్గం ఏర్పాటు అవుతుందని అధికారులతో చర్చించిన తర్వాత అభిప్రాయానికి వచ్చారు. ఆ మేరకు సుమారు కిలోమీటరు పొడవులో రూ.32 లక్షలతో చెరువులో రోడ్డును నిర్మించారు. సర్వాయపాళెం – మాతినవారిపాళెం గ్రామాల నడుమ మన్నంగిదిన్నె చెరువులో రోడ్డును నిర్మించడంతో పది గ్రామాల ప్రజలు సుదీర్ఘ కాలం పడుతున్న అవస్థలు తొలిగిపోయాయి. ఆ రోడ్డుపై కరెంటు స్తంభాలు సర్వాయపాళెం పంచాయతీ ద్వారా సమకూర్చే పనులు జరుగుతున్నాయి.

అసలు రోడ్డు వేస్తారని అనుకోలేదు



మేము పిల్లలుగా ఉన్నప్పుడు తెప్పలపై చెరువును దాటేవాళ్లం. పెద్దయ్యాక ఆ తెప్పలు కూడా లేవు. చెరువులో ఆడవాళ్లం దిగి దాటుకొని పోవడానికి ప్రాణాలు పోయినంత పనిగా ఉండేది. అసలు రోడ్డు వేస్తారని అనుకోలేదు. కాని ఇప్పుడు వేశారు. చాలా సంతోషం.

–కోర భారతి, మాతినవారిపాళెం గ్రామం

జగనన్న ప్రభుత్వం మేలు చేసింది



మా గ్రామాల ప్రజలను పట్టించుకున్న నాయకులు లేరు. అందుకే బ్రిడ్జి లేక ఎన్ని అవస్థలు పడ్డామో. ఇప్పుడు జగనన్న పాలనలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి శ్రద్ధ తీసుకొని చెరువులో బ్రిడ్జి కట్టించారు. జగనన్న ప్రభుత్వం మాకు చాలా మేలు చేసింది.

– తుళ్లూరు భవాని, సర్వాయపాళెం గ్రామం

ఎమ్మెల్యేకు రుణపడి ఉన్నాం



మా పెద్దోళ్లు ఈ చెరువును దాటుకొని రాకపోకలు చేయడానికి చేసిన సాహసాలు గురించి చెబుతుంటే వినేవాళ్లం. గతంలో నాయకులకు ఈ సమస్య గురించి చెబితే అవునా... బ్రిడ్జి కట్టిస్తాం అని చెప్పి వెళ్లిపోయేవారు. కాని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మా గ్రామాల సమస్యను పెద్దమనస్సుతో ఆలోచించి చెరువులో బ్రిడ్జిని కట్టించారు. ఎమ్మెల్యేకు ఎన్ని చేసినా ఆయన రుణం తీర్చుకోలేం.

– ఇస్సారపు శ్రీనివాసులు, సర్వాయపాళెం

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఆదాల, పక్కన మేయర్ స్రవంతి

• నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ : రూరల్ నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని 24వ డివిజన్ కల్లూరుపల్లి ఇందిరమ్మకాలనీ సమీపంలో రూ.47 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు డివిజన్ పరిధిలో రూ.5 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టినట్లు వివరించారు. ప్రజలకు అవసరమైన చోట్ల నిధుల కేటాయింపు చేస్తామన్నారు. ఈ ప్రాంతంలో మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, అన్నివర్గాల వారికి సంక్షేమ లబ్ధి చేకూరుతోందన్నారు. అవినీతికి తావులేకుండా ప్రజల వద్దకే సేవలు అందుతున్నాయన్నారు. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదన్నారు. మరలా సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టినట్లు వివరించారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు నీళ్ల సునీల్, ఇసనాక సురేంద్రరెడ్డి, ఉడతా మురళీ, విష్ణు, రామ్మోహన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్‌లు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

పేదలు బాగుండాలనేదే సీఎం తపన

• ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు : పేదలంతా బాగుండాలనేదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తపన అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని జమ్మిపాళెంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కుల, మత, పార్టీలను చూడకుండా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మాత్రమే దక్కుతుందన్నారు. గతంలో ప్రజలు సంక్షేమ పథకాల కోసం అధికారుల చుట్టూ, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు ఇంటికే అందుతున్నట్లు తెలిపారు. ఈ ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వెల్లడించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేయగా అనేక మంది టీడీపీ నేతలు సైతం సంక్షేమ పథకాలు అందుకుంటున్నట్లు తెలిసిందన్నారు. ఇదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ గొప్పతనమన్నారు. కరోనా కష్టకాలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికార యంత్రాంగం, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది మాత్రమే ప్రజల వద్ద ఉండి యోగక్షేమాలు చూశారన్నారు. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రకరకాల పార్టీల నేతలు ప్రజల వద్దకు వచ్చి పిచ్చివేషాలు వేస్తున్నారని, వారిని నమ్మవద్దని కోరారు. ఎవరి వల్ల తమకు సంక్షేమ పథకాలు అందాయో గుర్తుచేసుకోవాలని ప్రజలకు సూచించారు. మీ అందరి ఆశీర్వాదం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎల్లప్పుడు ఉండాలని కోరుతున్నానన్నారు. డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, డీసీఎమ్మెస్ చైర్మన్ చలపతిరావు, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

డిసెంబర్ 21న పేదలకు ఇళ్ల పంపిణీ



జగనన్న లేఅవుట్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్, అధికారులు

• సిటీ ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నగర నియోజకవర్గానికి సంబంధించి జగనన్న కాలనీలో పదివేల ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి డిసెంబర్ 21వ తేదీన పేదలకు అందిస్తామని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్ అన్నారు. నెల్లూరు నగరంలోని 54వ డివిజన్ భగత్ సింగ్ కాలనీలో ఉన్న వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను అధికారులతో కలిసి ఎమ్మెల్యే అనిల్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగర నియోజకవర్గానికి సంబంధించి పదివేల ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి డిసెంబర్ 21వ తేదీన ప్రజలకు అందిస్తామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన మేరకు పేదలకు సొంత స్థలంతో పాటు అన్ని సౌకర్యాలతో మంచి ఇంటిని అందించేందుకు అన్నిరకాలుగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడకుండా పనులు చేయిస్తున్నామని వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్నివర్గాలకు మేలు జరుగుతోందన్నారు. అర్హత కలిగిన ప్రతి పేదవాడికి జగనన్న లేఅవుట్‌లో స్థలంతో పాటు ఇల్లు కూడా మంజూరు అవుతుందన్నారు. అనంతరం టిడ్కో ఇళ్లలో మౌలిక సదుపాయాలను పరిశీలించి వాటికి సంబంధించి వార్డుకు ఎంత మంది శానిటేషన్‌కు అవసరమో నియమించి ఎవరికీ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సఫియా బేగం, దేవరకొండ సుజాత, నగరపాలక సంస్థ కో–ఆప్షన్ సభ్యులు జమీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.55
సన్నవి	: రూ.25
పండు	: రూ.5



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.117
లేయర్	రూ.118
బ్రాయిలర్ చికెన్:	రూ.210
స్కిన్‌లెస్ చికెన్:	రూ.230
లేయర్ చికెన్:	రూ.200



క్లుప్తంగా

నేడు మర్రిపాడులో 'జగనన్నకు చెబుదాం'

• అర్జీలు స్వీకరించనున్న కలెక్టర్

నెల్లూరు(దర్గామిట్ట) : ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం మండల స్థాయిలో నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం బుధవారం మర్రిపాడులో జరుగుతుందని జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మర్రిపాడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కలెక్టర్ ఎం.హరినారాయణన్, జేసీ ఆర్.కూర్మనాథ్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు.

ఓటీపీలపై అప్రమత్తత అవసరం

నెల్లూరు(పొగతోట) : ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీ నంబర్ అడిగితే చెప్పవద్దని, దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఆర్‌డీఏ పీడీ, గ్రామ, వార్డు సచివాలయాల అధికారి కేవీ సాంబశివారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఏదైనా అవసరమైతే లబ్ధిదారుని ఇంటికి వస్తారని తెలియజేశారు. ఎక్కడైనా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఫోన్ చేసి ఓటీపీ అడిగితే ఎంపీడీఓ లేదా మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఇద్దరు సీఐల బదిలీ

నెల్లూరు(క్రైమ్) : జిల్లాలో ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్–1గా పనిచేస్తున్న ఎం.మధుబాబును తిరుపతి జిల్లా సూళ్లూరుపేట సీఐగా బదిలీ చేసి కోవూరు సీఐగా పనిచేస్తున్న కె.రామకృష్ణారెడ్డిని స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్–1గా నియమించారు.

నలుగురు ఎస్సైల బదిలీ

నెల్లూరు(క్రైమ్): జిల్లాలో వివిధ పోలీసుస్టేషన్‌లలో పనిచేస్తున్న నలుగురు ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వర రెడ్డి మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కలువాయి ఎస్సై బి.మహేంద్రను బుచ్చికి, అక్కడ పనిచేస్తున్న కె.వీరప్రతాప్‌ను కొడవలూరుకు, అక్కడ పనిచేస్తున్న జి.సుబ్బారావును నెల్లూరు వీఆర్‌కు, ఆత్మకూరు ఎస్సై వి.రాజేష్‌ను సౌత్ ట్రాఫిక్‌కు బదిలీ చేశారు. వీరు వెంటనే ఆయా ప్రాంతాల్లో విధుల్లో చేరాలని ఆదేశించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి

• డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి

నెల్లూరు(పొగతోట) : గ్రామీణ ప్రాంతాల్లో బాల్యవివాహాలను అరికట్టేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి ఆదేశించారు. నగరంలోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఏసీలు, ఏపీఎంలు, సీసీలతో నిర్వహించిన గ్రామీణ అధికార పునరుద్ధరణ కార్యక్రమంపై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో పీడీ మాట్లాడారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు జండర్ కమిటీలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామ, మండల స్థాయిల్లో జండర్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతినెలా మొదటి గురువారం జండర్ కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. ఇందులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్, తహసీల్దార్, ఎంపీడీఓ, మహిళా పోలీసు, పీహెచ్‌సీ డాక్టర్ హాజరు కావాలన్నారు. ప్రత్యేక యాప్‌ను ఏర్పాటు చేసి 12 నుంచి 18 ఏళ్ల బాలికల వివరాలు సేకరించాలని, ప్రతినెలా పరిశీలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిద్వారా బాల్యవివాహాలను అరికట్టవచ్చన్నారు. 18 ఏళ్లు దాటిన తరువాత వారి వివరాలను యాప్ నుంచి తొలగించాలన్నారు. ప్రతి మండలంలో మహిళలతో 25 పరిశ్రమలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్త్రీనిధి రికవరీలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ నగదును దుర్వినియోగం చేసిన సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీపీఎం కామాక్షి, స్త్రీనిధి ఏజీఎం కామాక్షయ్య, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సారమ్మ, ఏపీఎం చిన్నయ్య పాల్గొన్నారు.

కొడవలూరు ఏపీఎంకు అవార్డు

స్వయం సహాయక గ్రూపుల నిర్వహణ, రుణాలు, రికవరీలు, పరిశ్రమల ఏర్పాటు తదితర అంశాల్లో కొడవలూరు ఏపీఎం రుక్మిణికి జాతీయ స్థాయిలో అవార్డు లభించడంతో ఆమెను డీఆర్‌డీఏ పీడీ సన్మానించారు.

స్పందన ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యం

• ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్



టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం(స్పందన)లో విద్యుత్‌శాఖకు సంబంధించి ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. నగరంలోని విద్యుత్‌భవన్‌లో ఉన్న ఆయన చాంబర్‌లో జిల్లాలోని విద్యుత్‌శాఖకు చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లతో మంగళవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీడీసీఎల్ నిర్వహిస్తున్న జీఐఎస్ సర్వే(వ్యవసాయ విద్యుత్ సర్వీసులు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల జియో ట్యాగింగ్)ను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ సర్వేలో జిల్లాలోని కొన్ని డివిజన్లు, సెక్షన్లు వెనుకబడి ఉన్నాయని, అందరూ సమష్టిగా పనిచేయాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత వ్యక్తుల వద్దకు వెళ్లి సమస్యలను పరిష్కరించాలని తెలియజేశారు. వినియోగదారులకు సంతృప్తికర సేవలు అందించడమే విద్యుత్‌సంస్థ ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు. జగనన్న కాలనీల్లో పూర్తయిన ఇళ్లకు వెంటనే విద్యుత్ సర్వీసులు ఇవ్వాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలు వచ్చినప్పుడు సంబంధిత సమాచారాన్ని యాప్‌లో పోస్ట్ చేయాలన్నారు. విద్యుత్ సిబ్బంది సేఫ్టీ కిట్స్‌ను వినియోగించి ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో టెక్నికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషాద్రి బాలచంద్ర, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి పాల్గొన్నారు.

ఆటో అపహరణపై ఫిర్యాదు

వెంకటాచలం : మండల పరిధిలోని కసుమూరు దర్గా వద్ద ఓ ఆటో అపహరణకు గురైన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ బాషా ఈనెల 11వ తేదీన తన ఆటోను దర్గా సమపంలోని చెరువు కట్టపై పార్కింగ్ చేశాడు. దర్గా గంధ మహోత్సవం ముగిసిన తరువాత 13వ తేదీ వెళ్లి చూడగా ఆటో కనిపించలేదు. తెలిసిన దగ్గర ఆరాతీయగా ఎలాంటి లాభం లేకుండా పోయింది. దీంతో బాధితుడు మంగళవారం వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

సంగం : పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి నెల్లూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు సంగం పోలీసులు మంగళవారం తెలిపారు. వారి వివరాల మేరకు.. పొదలకూరు మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన దేవళ్ల సురేంద్ర (27) సంగం మండలంలోని వంగల్లులో అత్తారింటి వద్ద ఏడాదిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఇటీవల సురేంద్ర భార్య అరుణ కూలి పనుల నిమిత్తం చెన్నైకు వెళ్లింది. ఏం జరిగిందో ఏమో కానీ ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం మద్యంలో పురుగు మందు కలుపుకుని తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న సురేంద్రను కుటుంబసభ్యులు నెల్లూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. సమాచారం అందుకున్న సంగం ఎస్సై నాగార్జునరెడ్డి కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా విద్యార్థులు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : స్కై మార్షల్ ఆర్ట్స్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల నుంచి జిల్లాస్థాయిలో అర్హత సాధించిన బాల బాలికలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వేగూరు ఆదినారాయణ తెలిపారు. స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో స్కై మార్షల్ ఆర్ట్స్ అండర్–14, 17, 19 విభాగాల్లో బాల బాలికలకు జరిగిన జిల్లా స్థాయి ఎంపికలు మంగళవారంతో ముగిశాయి. ఇందులో గెలుపొందిన వారు నవంబర్ 29, 30వ తేదీల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా తరఫున పాల్గొంటారని తెలిపారు.

మిద్దెపై నుంచి దూకిన వ్యక్తి మృతి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని దామరమడుగు గ్రామంలో ఈనెల 15న ఓ కల్యాణ మండపం మిద్దెపై నుంచి దూకిన వ్యక్తి నెల్లూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు.. కొడవలూరు మండలం యల్లాయపాళేనికి చెందిన షేక్ షాహుల్ హమీద్ (27) ఆటో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. గత ఆదివారం ఉదయం షాహుల్ భార్య ఆలియా తన ఇద్దరి పిల్లలతో కలిసి దామరమడుగులోని పుట్టింటికి వెళ్లింది. ఆమె వెళ్లిన కాసేపటికే హమీద్ కల్యాణ మండపంపై నుంచి దూకాడని అక్కడ పనిచేస్తున్న ఓ మహిళ ఆలియాకు సమాచారం అందించింది. వెంటనే ఆమె తన కుటుంబ సభ్యులతో అక్కడకు చేరుకుని భర్తను స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రికి తరలించింది. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరులోని జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వీరప్రతాప్ తెలిపారు.

ప్రతిభ



మన చుట్టూ మనకు తెలియకుండానే
ఎంతో మంది రకరకాల బాధలకు లోనవుతుంటారు.
వారిలో ముఖ్యంగా వృద్ధులు, వికలాంగుల
సమస్యలకు సరైన పరిష్కారం తెలియక
ఇబ్బందులు పడుతుంటారు.
వారి మానాన వారిని అలాగే వదిలేయడం కన్నా
పరిష్కారాన్ని కనుగొంటాను అనుకున్నాడు.
తనదైన మార్గంలో ప్రయత్నించాడు.
విజయం సాధించాడు.
సత్కారాలను పొందుతున్నాడు
హైదరాబాద్ వాసి హేమేష్ చదలవాడ.

తల్లి సంధ్యతో హేమేష్ చదలవాడ

అమ్మమ్మలకు అండగా!

దేశవ్యాప్తంగా వివిధ రంగాలలో సేవలు అందించిన 21 ఏళ్ల లోపు 20 మంది యువ సాధకులను ఢిల్లీలో మొన్న జరిగిన 'అన్‌స్టాపబుల్ 21' వేదికగా సత్కరించారు. హ్యూమన్ స్టడీస్, సైన్స్, క్రీడలు, ఫైన్ ఆర్ట్స్, పెర్ఫార్మింగ్ ఆర్ట్, సోషల్ ఇంపాక్ట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అనే ఏడు రంగాలలో ప్రతిభావంతులైన యువతకు ఈ సత్కారాన్ని అందజేశారు. వారిలో హైదరాబాద్‌కు చెందిన 16 ఏళ్ల హేమేష్ చదలవాడ ఎలక్ట్రానిక్స్ రంగంలో కనబరిచిన ప్రతిభకు గుర్తింపు పొందాడు.

వృద్ధులకు సహాయం..

హేమేష్ పన్నెండేళ్ల వయసు నుంచి ఎలక్ట్రానిక్స్, రోబోటిక్స్ రంగంలో గణనీయమైన ప్రతిభను చూపుతున్నాడు. అల్జీమర్స్ వ్యాధితో బాధ పడుతున్న అమ్మమ్మను చూసి ఆమెకు ఏదైనా సాయం చేయాలనుకున్నాడు. తన ఆలోచనల గురించి హేమేష్ చెబుతూ 'నడిచేటప్పుడు అమ్మమ్మ అడుగులు తడబడుతుండేవి. మతిమరపు ఉండేది. ఆమెకు తన మీద తనకు కంట్రోల్ ఉండేది కాదు. కొన్నిసార్లు అర్ధరాత్రి మంచంపై నుంచి లేచి ఎటో వెళ్లిపోయేది. దీంతో ఆమెను కనిపెట్టి ఉండటం కష్టమయ్యేది. అమ్మమ్మకు, ఆమెను చూసుకునే మాకూ ఇదో సవాల్‌గా ఉండేది. కొన్ని అందుబాటులో ఉన్న డివైజ్‌లను ప్రయత్నించి చూశాం. కానీ, ఏ మాత్రం సంతృప్తిగా అనిపించలేదు. అమ్మమ్మకు సాయ పడే డివైజ్‌ను నేనే సొంతంగా తయారుచేయాలనుకున్నాను' అని తనలో రూపుదిద్దుకున్న ఆలోచనను వివరిస్తాడు. హేమేష్ కృషి, పట్టుదల, అంకితభావానికి అతని తల్లిదండ్రులు కిశోర్, సంధ్యలు ప్రోత్సాహం అందించారు.



హేమేష్ తయారుచేసిన డివైజ్

> మా అమ్మమ్మ వయసున్న వారు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు ఇది సరైన పరిష్కారం సూచిస్తుంది. ఎంతో మందికి సాయం చేస్తుందని ప్రామిస్ చేస్తున్నాను.
> – హేమేష్

పరికరం ఎలా పనిచేస్తుందంటే..

ఈ పరికరం వాచ్‌లాగా మణికట్టుకూ కట్టుకోవచ్చు. బ్యాడ్జ్‌గానూ ధరించవచ్చు. రోగి నడక, భంగిమ, శరీర ఉష్ణోగ్రత, నాడిని పర్యవేక్షిస్తుంది. నీళ్ల జారిపడుతుండే శబ్దాన్ని కూడా గుర్తించగలదు. మనిషి దూరంగా తిరుగుతున్నప్పుడు లేదా పడిపోవడం వంటి ప్రమాదంలో ఉన్నప్పుడు వెంటనే తెలియజేస్తుంది. ఇంకా అలారంలో 'పిల్‌బాక్స్' ఫీచర్ కూడా ఉంటుంది. ఇది రోగులు వారి మందులు తీసుకునే సమయం వచ్చినప్పుడు హెచ్చరికలను పంపుతుంది. 'ఈ డివైజ్ మా అమ్మమ్మ కోసం తయారుచేసినప్పుడు ఇంటర్నెట్ సరైన మార్గం చూపింది. అయితే, ఈ పరికరం పూర్తయ్యేసరికి అమ్మమ్మ చనిపోయారు' అని బాధపడే హేమేష్ డివైజ్ చేతిలో పట్టుకొని 'మా అమ్మమ్మ వయసున్న వారు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు ఇది సరైన పరిష్కారం సూచిస్తుంది. ఎంతోమందికి సాయం చేస్తుందని ప్రామిస్ చేస్తున్నాను' అని చెబుతున్న హేమేష్ 12వ తరగతి చదువుతున్నాడు. తన తదుపరి ప్రాజెక్ట్‌తో ఎలక్ట్రానిక్స్, రోబోటిక్ రంగంలో మరిన్ని అడుగులు వేస్తున్నట్టుగా వివరించాడు.

2021లో ప్రధానమంత్రి చేతుల మీదుగా రాష్ట్రీయ బాల పురస్కారాన్ని అందుకున్నాడు. పేరున్న కంపెనీల నుంచి గ్రాంట్‌లను పొందాడు.

– నిర్మలారెడ్డి


మణిపూర్ ఒక మంచి వార్తను వినిపించింది.
ఆ రాష్ట్రానికి చెందిన మహిళా దర్శకురాలు మీనా లాంగ్‌జామ్ తీసిన
'ఆంద్రో డ్రీమ్స్' ముంబైలో జరుగుతున్న చలన చిత్రోత్సవంలో
బెస్ట్ డాక్యుమెంటరీగా ఎంపికైంది.
మణిపూర్‌లోని మారుమూల గ్రామం 'ఆంద్రో'లో ఆడపిల్లల
ఫుట్‌బాల్ క్లబ్‌ను 30 ఏళ్లుగా పరిస్థితులకు ఎదురీది నడుపుతున్న
'లైబి' అనే మహిళ పోరాటాన్ని ఈ డాక్యుమెంటరీ రికార్డు చేసింది.
ఆడపిల్లల క్రీడా స్వేచ్ఛను ఎన్ని అడ్డంకులొచ్చినా
కొనసాగనివ్వాలనే సందేశం ఇచ్చే ఈ డాక్యుమెంటరీ
దేశ, విదేశాల్లో ప్రశంసలు పొందుతోంది.

అడ్డంకులను దూరంగా తన్ని...



దర్శకురాలు: మీరా లాంగ్‌జామ్

న్యూస్‌మేకర్



ఆంద్రో డ్రీమ్స్ పోస్టర్

అంతా చేసి ఎనిమిది వేల మంది జనాభా మించని ఊరు ఆంద్రో. మణిపూర్ తూర్పు ఇంఫాల్ జిల్లాలో మారుమూల ఉంటుంది అది. అక్కడి ఆడపిల్లలు ఫుట్‌బాల్ ఆడితే ఏంటి... ఆడకపోతే ఏంటి? కాని 60 ఏళ్ల లైబి మాత్రం– ఆడాల్సిందే అంటోంది. ఆమె గత ముప్పై ఏళ్లుగా 'ఆంద్రో మహిళా మండల్ అసోసియేషన్– ఫుట్‌బాల్ క్లబ్' (అమ్మ– ఎఫ్‌సీ) నడుపుతోంది. ఈ క్లబ్‌కు నిధులు లేవు. బిల్డింగ్ లేదు. ఊళ్లో ప్రోత్సాహం లేదూ, ఏమీ లేదు. కాని లైబి మాత్రం అంతా తానై క్లబ్‌ను నడుపుతోంది. ఈ మధ్యే ఆమె ఒక పూరి పాక నిర్మించి దానినే క్లబ్ బిల్డింగ్‌గా ప్రారంభించుకుంది.

'అమ్మాయిలు కేవలం వంటకు, ఇంటి పనికి అంకితమై పోకూడదు. చదువుకోవాలి. ఆడాలి. ధైర్యంగా భవిష్యత్తును నిర్మించుకోవాలి. మా ప్రాంతంలో పురుషులదే సర్వాధికారం. ఇంటి పెద్ద, తెగ పెద్ద ఎంత చెప్తే అంత. వారి దృష్టిలో ఆడవాళ్ల గురించి చింతించాల్సింది ఏమీ ఉండదు. అమ్మాయిలు ఆడతామన్నా ఒప్పుకోరు. నా పోరాటం వల్లే ఇవాళ మా ఊరి నుంచి జాతీయ స్థాయిలో అమ్మాయిలు ఫుట్‌బాల్ ఆడుతున్నారు' అంటుంది లైబి.



తన ఫుట్‌బాల్ క్లబ్ పూరి పాక ముందు లైబి

ఈమె పోరాటం ప్రపంచానికి చెప్పదగ్గది అనిపించింది మణిపూర్‌కే చెందిన మహిళా దర్శకురాలు మీనా లాంగ్‌జామ్‌కు. అలా తయారైన డాక్యుమెంటరీనే 'ఆంద్రో డ్రీమ్స్'.

ఇద్దరి కథ

ప్రస్తుతం ముంబైలో 'జాగరణ్ ఫిల్మ్ ఫెస్టివల్' అట్టహాసంగా జరుగుతోంది. ఇందులో 'ఆంద్రో డ్రీమ్స్' బెస్ట్ డాక్యుమెంటరీగా నిలిచింది. ఇప్పటికే కేరళ, కొరియన్ ఫిల్మ్ ఫెస్టివల్స్‌కు ఎంపికైన ఈ డాక్యుమెంటరీ ముంబైలో విమర్శకుల్ని విశేషంగా ఆకట్టుకుంది. 'దీనికి కారణం ఆంద్రోలో అమ్మ క్లబ్‌ను నడుపుతున్న లైబి పోరాటాన్ని, ఆ క్లబ్‌లో గొప్ప ఫుట్‌బాల్ ప్లేయర్‌గా ఉంటూ మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలనుకునే నిర్మల అనే అమ్మాయి ఆకాంక్షలని నేను చూపించడమే. ఒక రకంగా చాదస్త వ్యవస్థతో రెండు తరాల స్త్రీల పోరాటం ఈ డాక్యుమెంటరీ' అని తెలిపింది మీనా లాంగ్‌జామ్.

మణిపూర్ వెలుతురు

నిజానికి మే 3వ తేదీ నుంచి మణిపూర్ వేరే కారణాల రీత్యా వార్తల్లో ఉంది. కాని మణిపూర్‌ను అభిమానించేవారికి ఇప్పుడు ఈ డాక్యుమెంటరీ సాధిస్తున్న విజయాలు సంతోషాన్ని ఇస్తున్నాయి. 'నా డాక్యుమెంటరీ విజయం మా ప్రాంతంలో గతాన్ని మర్చిపోయి కొత్త జీవితం మొదలుపెట్టే ఉత్సాహాన్ని ఇస్తే అంతే చాలు' అంది మీనా లాంగ్‌జామ్. మణిపూర్ యూనివర్సిటీలో కల్చరల్ స్టడీస్‌లో ప్రొఫెసర్‌గా ఉన్న మీనా పాఠాలు చెప్పడంతో పాటు డాక్యుమెంటరీలు కూడా తీస్తుంది. 2015లో ఆమె మణిపూర్‌లో ఫస్ట్ మహిళా ఆటోడ్రైవర్‌గా ఉన్న లైబీ ఓయినమ్ మీద డాక్యుమెంటరీ తీస్తే దానికి చాలా పేరొచ్చింది. ఆ తర్వాత 'అచౌబీ ఇన్ లవ్' పేరుతో పోలో ఆటకు అనువైన స్థానిక జాతి అశ్వాలపై డాక్యుమెంటరీ తీస్తే దానికీ పేరొచ్చింది. ఇప్పుడు 'ఆంద్రో డ్రీమ్స్' మణిపూర్ ఘనతను చాటుతోంది.

బాలికలు, యువతులు క్రీడల్లో ఎంతో రాణిస్తున్నా ఇంకా గ్రామీణ ప్రాంతాల్లో ఆంక్షలు ఉండనే ఉంటాయి. అలాంటి ప్రతి చోట అమ్మాయిలను ప్రోత్సహించే లైబి లాంటి యోధురాళ్లు, వారి గెలుపు గాథలను లోకానికి తెలిపే మీనా లాంటి వాళ్లు ఉండాలని కోరుకుందాం.

యూత్ పల్స్

ఢీ అంటే ఢీ

ఆర్ట్ ఆఫ్ డీఇన్‌ఫ్లుయెన్సింగ్

'ఇప్పటి వరకు ఇన్‌ఫ్లుయెన్సర్ పవర్ ఏమిటో చూశారు. ఇక డీఇన్‌ఫ్లుయెన్సర్ పవర్ ఏమిటో చూసే టైమ్ వచ్చింది'... ఇది తెలుగు సినిమాలో మాస్ డైలాగ్ కాదు. సోషల్ మీడియాలో ఒక కుర్రాడు పెట్టిన కామెంట్.

సోషల్ మీడియాలో ఇన్‌ఫ్లుయెన్సర్‌ల హవా నడుస్తున్న కాలం ఇది. కస్టమర్‌లు ఏది కొనాలో, ఏ షో చూడాలో, ఎలాంటి ఆరోగ్య సూత్రాలు పాటించాలో చెబుతున్నారు. ఇప్పుడు ఈ ట్రెండ్‌కు అడ్డుపడే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' ట్రెండ్ యువతరం నుంచే వచ్చి బలపడుతోంది. ట్రెడిషనల్ ఇన్‌ఫ్లుయెన్సర్‌లు ఒక ప్రాడక్ట్‌ను హైప్ చేస్తే డీఇన్‌ఫ్లుయెన్సర్‌లు ఆ హైప్‌ను ఛాలెంజ్ చేస్తున్నారు....





> సమస్య ఇన్‌ఫ్లుయెన్సర్‌లు కాదు. కొందరు ఇన్‌ఫ్లుయెన్సర్‌లు అనుసరిస్తున్న ధోరణి. వారిలో మార్పు రావాలి. సామాజిక బాధ్యత పెరగాలి. యువతలో అశాంతి, ఆందోళన రేకెత్తించే కంటెంట్‌కు దూరంగా ఉండాలి.
> – హిమాద్రి పటేల్, డిజిటల్ క్రియేటర్

మార్కెటింగ్ డాటా అండ్ ఎనలిటిక్స్ కంపెనీ కంతార్ స్టడీ రిపోర్ట్ ప్రకారం వినియోగదారులపై ఇన్‌ఫ్లుయెన్సర్‌ల సిఫారసుల ప్రభావం తక్కువేమీ కాదు. సోషల్ మీడియాలో ఎటు చూసినా ఇన్‌ఫ్లుయెన్సర్‌లు కనిపిస్తారు. టీ పొడుల నుంచి టీపాయ్‌ల వరకు రకరకాల ప్రాడక్ట్స్‌ను ప్రమోట్ చేయడానికి చిన్నచిన్న క్యాచీ వీడియోలను రూపొందిస్తారు. దీనికి భిన్నంగా ఒక ప్రాడక్ట్‌ను విశ్లేషిస్తూ విమర్శిస్తే...అదే డీఇన్‌ఫ్లుయెన్సింగ్!

'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' హ్యాష్‌ట్యాగ్‌తో టిక్ టాక్‌లో ఈ ట్రెండ్ మొదలైంది.

సోషల్ మీడియా ఎనాలటిక్స్ ఫర్మ్ ట్యూబ్యులర్ ల్యాబ్స్ చెబుతున్నదాని ప్రకారం గత సంవత్సరం నుంచి ఈ ట్రెండ్ ఊపందుకుంది. మ్యాడి వెల్ అనే ఇన్‌ఫ్లుయెన్సర్ ప్రముఖ కాస్మటిక్ స్టోర్స్‌లో పని చేసింది. కొన్ని ప్రాడక్ట్స్ పట్ల కస్టమర్‌లు ఎందుకు విముఖంగా ఉన్నారో తన స్వీయ అనుభవాలను తెలియజేసింది. ఈ ప్రభావంతో ఆమె పేరు ఇన్‌ఫ్లుయెన్సర్‌ల జాబితా నుంచి డీఇన్‌ఫ్లుయెన్సర్‌ల జాబితాలోకి చేరింది.

న్యూయార్క్‌కు చెందిన ఇరవై సంవత్సరాల క్లారా కొన్ని బ్రాండ్‌లను విమర్శిస్తూ వీడియోలు చేసింది. వాటిలో ఒకటి వైరల్‌గా మారింది. అదే సమయంలో తాను విమర్శించిన బ్రాండ్ నుంచి ఎలాంటి స్పందన వస్తుందో అనే భయం పట్టుకుంది. అయితే తనకు తానుగా ధైర్యం తెచ్చుకోవడానికి ఎంతో సమయం పట్టలేదు.

'నేను సరియైన వివరాలతోనే వీడియో చేశాను. నేనెందుకు భయపడాలి' అంటోంది క్లారా.

మన సెలబ్రిటీ ఒకరు ఆరోగ్య సంబంధమైన విషయాలపై కాస్త లోతుగానే మాట్లాడాడు. అయితే ఆయన అవగాహన లోపాన్ని ఒక వైద్యుడు వెంటనే ఎత్తిచూపాడు. పాపులర్ చైనీస్ వ్లోగర్ ఒకరు తన వయసు తక్కువగా కనిపించేలా సాంకేతిక మాయ చేస్తే ఎవరో కుర్రాడు కనిపెట్టి 'ఆయన అసలు రూపం ఇది' అని చూపాడు.

స్వీడన్ ఇన్‌ఫ్లుయెన్సర్ ఫేక్ ట్రిప్ గురించి మరొక యువకుడు 'ఇవి ఫొటోషాప్ చిత్రాలు' అని నిజాన్ని బహిర్గతం చేశాడు. నిజానికి ఇలాంటివి సోషల్ మీడియాలో గతంలో లేవని కాదు. అయితే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' పుణ్యామా అని 'అది కాదు ఇది' అని వెంటనే సాధికార సమాచారంతో స్పందించే ధోరణి పెరిగింది.

డీఇన్‌ఫ్లుయెన్సర్‌లు ఓవర్–హైప్‌డ్ ప్రాడక్ట్స్‌ను విమర్శించడమే కాదు చౌక ధరల్లో లభించే వాటి గురించి చెబుతున్నారు.

యూనివర్శిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలోని వార్టన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ప్రొఫెసర్ అయిన అమెరికస్ రీడ్ ఇలా అంటున్నారు... 'ఇన్‌ఫ్లుయెన్సర్‌లలో ఎక్కువ మంది సాధికారికంగా మాట్లాడడం లేదేమో అనే భావన కస్టమర్‌లలో వచ్చింది. డబ్బులు ఇస్తారు కాబట్టి సంబంధిత ప్రాడక్ట్‌ను ప్రమోట్ చేస్తారు. నిజానిజాల గురించి వారికి అవసరం లేదు. ఈ నేపథ్యంలో కాస్తో కూస్తో డీఇన్‌ఫ్లుయెన్సర్‌రే నయం అనుకుంటున్నారు. నిజానికి డీఇన్‌ఫ్లుయెన్సర్ కూడా ఇన్‌ఫ్లుయెన్సర్‌రే'

కొందరు ఒక అడుగు ముందుకు వేసి ఈ ట్రెండ్‌కు 'యాంటీ క్యాపిటలిస్ట్' ట్రెండ్‌గా నామకరణం చేశారు.

డీఇన్‌ఫ్లుయెన్సింగ్ ట్రెండ్ వల్ల వృథా ఖర్చులు తగ్గుతాయని, వేలం వెర్రికి అడ్డుకట్టపడుతుందని, పర్యావరణ కోణంలో కూడా ఈ ట్రెండ్ వల్ల మేలు జరుగుతుందని యువతరంలో ఎంతోమంది బలంగా వాదిస్తున్నారు. తమ అభిప్రాయాలను సామాజిక మాధ్యమాలలలో ఇతరులతో పంచుకుంటున్నారు. అయితే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' ట్రెండ్‌పై ప్రశంసలతో పాటు విమర్శలు కూడా ఉన్నాయి.

డీఇన్‌ఫ్లుయెన్సింగ్‌కు విషయ సాధికారత, నిజాయితీ అనేవి కీలకం. అయితే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' రూపంలో సూడో–అథెంటిసిటీ ముందుకు వస్తుందని, ఈ ట్రెండ్‌ను తమ స్వార్థానికి ఉపయోగించుకునే వారి సంఖ్య పెరుగుతుందనే విమర్శ ఉంది.

'ఈ ట్రెండ్ కాస్త చివరికి ఎలా మారుతుందంటే ఇది కొనవద్దు. మీరు కొనాల్సింది అది అన్నట్లుగా!' అంటుంది 26 సంవత్సరాల అమెరికన్ ఇన్‌ఫ్లుయెన్సర్ జెస్సిక.

'ముఖ్యమైన విషయం ఏమిటంటే ఇన్‌ఫ్లుయెన్సర్‌లు చెప్పగానే కస్టమర్‌ల అభిప్రాయాలు రాత్రికి రాత్రి మారిపోవు. ఇన్‌ఫ్లుయెన్సర్‌లు కేవలం సలహా ఇస్తారు. అంతే. ఏది కొనాలి, ఏది కొనకూడదు అనే స్వీయవిచక్షణ కస్టమర్‌లలో ఉంది. ఇన్‌ఫ్లుయెన్సర్‌లుగా మేము పారదర్శకంగా, నిజాయితీగా ఉంటాం' అంటుంది ఫ్రాన్స్‌కు చెందిన ఇన్‌ఫ్లుయెన్సర్ కోలిన్. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో 4,00,000 ఫాలోవర్స్ ఉన్నారు.

ప్రస్తుతం డీఇన్‌ఫ్లుయెన్సింగ్ ట్రెండ్ హెల్త్, ఫైనాన్స్, లైఫ్‌స్టైల్ విభాగాలలో ఎక్కువగా కనిపిస్తుంది.

'డీఇన్‌ఫ్లుయెన్సింగ్ అనేది వాపా బలుపా?' అనేది పక్కన పెడితే ఈ ట్రెండ్ మూలంగా ఇన్‌ఫ్లుయెన్సర్‌లు ప్రాఫిట్‌కు మాత్రమే కాదు మెరిట్‌కు కూడా ప్రాధాన్యత ఇచ్చే ధోరణి, జవాబుదారీతనం పెరుగుతుంది.

● ఆటో అన్సారీ

లైఫ్ గేర్ మార్చింది



నజ్మా అన్సారీ

ఓ యువకుడు యాచకుడి వేషంలో, కేజీల మొత్తంలో కరెన్సీ నాణేలను తీసుకుని ఐఫోన్ కొనడానికి వెళ్లిన వార్త ఇటీవల సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. మంచి వయసు, ఓపిక ఉన్న వారే ఇలా చేస్తుంటే... ఓపిక లేకపోయినా సమాజంలో గౌరవంగా బతికేందుకు బురఖా వేసుకుని ఆటో నడుపుతోంది నజ్మా అన్సారీ. అయినా ఇతరుల ముందు చేయి చాచే కంటే.. కష్టపడడమే గౌరవం అనుకుంది. 'గేర్లు మార్చేయండి చాలు గౌరంగా బతకవచ్చు' అని చెబుతూ ఎంతో మందికి ప్రేరణగా నిలుస్తోంది.



నజ్మా అన్సారీ వయసు 45. ఉత్తరప్రదేశ్, మొరాదాబాద్ నగరంలోని కట్‌ఘర్‌లో ఆమె నివసిస్తోంది. ఆమెకు ఇద్దరు పిల్లలు. 2010లో భర్త మరణించడంతో ఇంటి భారం ఆమె మీద పడింది. అప్పటిదాక గృహిణిగా ఉన్న నజ్మాకు తన కొడుకు, కూతుర్ని ఎలా పెంచాలో అర్థం కాలేదు. భర్త నడిపిన టీషాపును అద్దె కట్టలేక వదిలేసింది. ఇంట్లోనే టీ తయారు చేసి విక్రయించింది. అలా పిల్లల అవసరాలు చూసుకుంటూ ఉండగానే భర్త ఇన్సురెన్స్ డబ్బులు రూ.4.35 లక్షలు వచ్చాయి. మూడు లక్షల రూపాయలతో 2015లో కూతురికి పెళ్లి చేసింది.

ఆదాయం సరిపోక..

టీ స్టాల్ నడుపుతూ కుటుంబాన్ని లాక్కొస్తున్న నజ్మాకు డబ్బులు సరిపోయేవి కావు. కూతురి పెళ్లి తరువాత ఆర్థిక ఇబ్బందులు పెరిగాయి. దీంతో భర్త ఇన్సురెన్స్ డబ్బుల్లో మిగిలిన మొత్తంతో ఎలక్ట్రిక్ ఆటో కొనుక్కుంది. ఇంటి పనులన్నీ పూర్తిచేసి ఆటో తోలుతూ సంపాదిస్తోంది.

అర్ధరాత్రనే భయం లేదు

నజ్మా మూడు షిప్టుల్లో ఆటో నడుపుతోంది. బురఖా ధరించి ఉదయం తొమ్మిదిగంటలకు ఆటో స్టార్ట్ చేస్తుంది. ఎండ వేడికి బురఖాలో ఎక్కువ సమయం ఉండలేక మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటికి వచ్చేస్తుంది. తిరిగి సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి ఎనిమిది వరకు ఆటో నడుపుతోంది. మళ్లీ రాత్రి తొమ్మిది నుంచి రెండుగంటల వరకు విరామం లేకుండా నడుపుతుంది. ఇలా మూడు షిఫ్టుల్లో మొత్తం మీద రోజుకి ఐదు నుంచి ఆరు వందల వరకు సంపాదిస్తోంది. స్థానిక ట్రాఫిక్ పోలీసులు నజ్మా ధైర్యాన్ని మెచ్చుకుని ప్రోత్సహిస్తున్నారు. అయితే నజ్మాను చూసిన ఓ హిందూ మహిళ కూడా ఆటో నడపడం మొదలు పెట్టింది. దీంతో ఆ మహిళ ఆర్థిక పరిస్థితులు కూడా మెరుగు పడ్డాయి. ఇలా ఇతరులకు స్ఫూర్తి నిలుస్తూనే, తన కష్టార్జితంతో హజ్ యాత్రకు వెళ్తానని చెబుతోంది నజ్మా.

అడుక్కునే కంటే...

''పేదరికం ఉందని అక్కడా ఇక్కడా చేయి చాచకుండా కష్టపడి ఏ పనైనా చేసి గౌరవంగా బతకవచ్చు. ఆటో గేర్లు మారుస్తూ, ప్రయాణికులను గమ్యాలకు చేరుస్తున్నాను. ఇక మహిళా డ్రైవర్‌గా నాకు రాత్రి సమయాల్లో కూడా ఎటువంటి ఇబ్బంది ఎదురు కాలేదు. ముఖ్యమంత్రి యోగి ప్రభుత్వం వచ్చాక అర్ధరాత్రి బయటకు రావడానికి కూడా భయం వేయడం లేదు. ప్రభుత్వ అధికార యంత్రాంగం మాకు రక్షణ కల్పిస్తోంది. పరిస్థితులు మరింత దిగజారినప్పుడు అల్లా కాపాడతాడు'' అని నజ్మా అన్సారీ ధైర్యంగా చెబుతోంది.

బ్యూటిప్స్





● వేప చెట్టు ఇంటి దగ్గర్లో ఉంటే వేరే సౌందర్యసాధనాలతో పనే ఉండదు. వేపాకులు, బెరడు, వేపనూనె ఔషధాలుగానే కాదు, సౌందర్య సాధనాలుగానూ ఉపయోగపడతాయి. ఎలాంటి చర్మ సమస్యలకైనా వేపతో ఇట్టే చెక్ పెట్టేయవచ్చు. ● ముఖంపై మొటిమలు, నల్లమచ్చలు ఏర్పడుతుంటే వేపాకులతో చక్కని విరుగుడు ఉంది. గుప్పెడు వేపాకులను అరలీటరు నీటిలో వేయాలి. వేపాకులు పూర్తిగా మెత్తగా మారిపోయేంత వరకు ఆ నీటిని మరిగించాలి. కాసేపటికి నీరు ఆకుపచ్చ రంగులోకి మారుతుంది. అప్పుడు వడగట్టి ఆ కషాయాన్ని సీసాలో భద్రపరచుకోవాలి. ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు ఆ నీటితో కాస్త దూదిని తడిపి ముఖాన్ని రుద్దుకుంటే చాలు. మొటిమలు, మచ్చలు మటుమాయం అవుతాయి. ● చర్మం పొడిబారి, తరచు దురదలు పెడుతున్నట్లయితే, పైన చెప్పుకున్నట్లే వేపాకులతో కషాయం చేసి, బకెట్ నీటిలో ఒకకప్పు కషాయాన్ని పోసి ఆ నీటిని స్నానానికి ఉపయోగిస్తే చాలు. కొద్దిరోజుల్లోనే చర్మం ఆరోగ్యకరంగా మారుతుంది. ● ముఖం తరచు జిడ్డుగా మారుతుంటే, వేపాకుల పొడి, గంధంపొడి, గులాబి రేకుల పొడి సమభాగాలుగా తీసుకుని కలుపుకోవాలి. చెంచాడు పొడిలో మూడు నాలుగు చుక్కల వేపనూనె, కొద్దిగా తేనె, నిమ్మరసం పిండుకుని ముద్దలా కలుపుకోవాలి. దానిని ముఖానికి పట్టించి, అరగంటసేపు ఆరనివ్వాలి. పూర్తిగా ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇలా చేస్తే ముఖం తాజాగా మారుతుంది.